

# ఆశయాలు-అవకాశాలు

ఆకెళ్ల వెంకటేశ్వరరావు

రామారావుకి పుట్టెడు బెంగ పట్టుకుంది. తనకి ఇంక పెళ్లిఅవ్వదేమోనని. ఈమధ్యన మరీ ఎక్కువయిందనే చెప్పాలి. ఐదు సంవత్సరాలనుంచీ ప్రయత్నంచేస్తున్నాడు పెళ్ళి చేసుకోవాలని. కానీ ఒక్క ఆడకూతురుకూడా ముందుకు రాలేదు అతని పర్సనాలిటీ చూసి. అలా అని ఏ పిల్లనైనా అర్ధాంగిగా స్వీకరించలేదు. అతనికి కొన్ని కోర్కెలు, ఆశలు ఉన్నాయి. తనకి కాబోయే అర్ధాంగికి కొన్ని నిర్దుష్టమైన లక్షణాలుండాలని అనుకొన్నాడు. గులాబిరంగు ఛాయ, సన్నని ముత్యాల లాంటి పలువరస, నల్లటి నక్షత్రాల్లా మెరిసే కళ్లు, పూతరేకులాంటి అధరాలు, బన్ రొట్టిలాంటి బుగ్గలు, తగ్గ పర్సనాలిటీ. నుంచుంటే తనకు చెవులదాకా రావాలి ఎత్తు, డిగ్రీ ఉంటే మంచిదే! అలాటి అర్ధాంగికి నడుంచుట్టూరా చేయి వేసి ఏ యింపాలా కారులోనో తిరగాలనుకున్నాడు. వెన్నెలలో ఆడుకోవాలనుకున్నాడు. కాని ఇవన్నీ కలల్లోనే జరిగాయి. కల చెదిరేటప్పటికి తలగడ చుట్టూ చేతులేయడమో లేక పట్టెమంచంని కావలించుకోవడమో జరిగేది ఆ దెబ్బతో నీరు కారిపోయేవాడు. ఇన్ని లక్షణాలున్న అమ్మాయి మాట దేవుడెరుగు కాని, కనీసం ఒక్క లక్షణం ఉన్నది కూడా అతని ఐదేళ్ళ వేటలో దొరకలేదు. దాంతో నీరు కారిపోయి కోపం వచ్చి తనను తానే తిట్టుకొనేవాడు. ఒకసారి విసుగొచ్చి, "ఈ సర్పజాతిని సమూలంగా నాశనం చేస్తాను" అన్నాట్ట వెనకటికి ఒకరాజు. అలాగే 'మన రామారావు ఇంక ఈ జన్మకి పెళ్ళి చేసుకోను' అన్నాడు. అదేదో పెద్ద ఆడజాతిని ఉద్ధరించను అన్నట్లు. ఆ ప్రతిజ్ఞ ఎంతో కాలం నిలబడలేదు. ఆఫీసునుంచి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు కనిపించే రామచిలకలని చూడకుండా ఉండలేకపోయేవాడు. వాళ్ల ఒంపులు, సొంపులు మార్గాన్ని మార్చాయి. ఆ మల్లెపూల

వాసనలూ, లవంగాల మత్తుకి తట్టుకో లేక ఉక్కిరిబిక్కిరై, ఇమీడియట్‌గా ఈ సంవత్సరంలో ఎలాగైనా పెళ్ళి చేసుకోవాలి అనుకున్నాడు.

రామారావుకి ఇరవై ఆరేళ్ళుంటాయి. బి కాం. పాసై బ్యాంకిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఒక యాభైవేల ఆస్తి ఉంటుంది నా అనేవాళ్ళెవరూ లేరు. పెర్సనాల్టీ తప్పించి, మనిషి చాలా అందంగా ఉంటాడనే చెప్పాలి.

ఒకరోజు క్యాంటీన్‌లో కాఫీ త్రాగు తుంటే "ఏమోయ్, ఇంకా పెళ్ళిచేసుకో వేమిటి ? బెండకాయ ముదిరినా బ్రహ్మ చారి ముదిరినా అంత మంచిదికాద న్నారు." అన్నాడు మేనేజరు పరంధా మయ్యగారు

"నిజమేనండి, మంచిదికాదు. చేసు కోవాలనే అనుకుంటున్నాను" అన్నాడు అమాయకంగా పోజుపెట్టి

"నా ఫ్రెండు కూతురు ఉందోయ్ లక్షదాకా కట్నం ఇస్తాడు. నీకు కొంచెం ఆస్తి ఉండగా, నువ్వు సరేనంటే అన్నీ జరిగిపోతాయి."

లక్ష అనేటప్పటికి వెక్కిళ్ళు వచ్చి నంత పనైంది రామారావుకి. "చూడ కుండా నేనాండి" అప్పుడే అతని కళ్ల ముందు ఇంపాలా కారు, నడుంచుట్టూ చేతులు, పున్నమి వెన్నెల, సినిమా రీలులా తిరిగాయి

"భలేగా మాట్లాడతావోయ్. నువ్వు చూడకుండానే జరుగుతాయా అన్నీ." వీపు తడుతూ అన్నాడు పరంధామయ్య.

"ఎడ్రసు రాసిచ్చి రేపు ఆదివారం పదిగంటలకు రా. నేను అటునుంచి అటే వస్తాను. మరిచిపోకు. పెద్దవాళ్ళతో పని. బాగుండదు."

థేంక్స్ చెప్పాలి అనుకున్నాడు మరి చవటలా చూస్తాడేమో అని, అలాగే వస్తానండి అన్నాడు బుద్ధిమంతుడిలా. ఆ సంగతే తన ప్రాణస్నేహితుడు శేఖర్‌తో చెప్పి రేపు రమ్మన్నాడు.

* * *

రామం ఒక్కసారి ఆశ్చర్య పోయేడు. తనుపెళ్ళిచూపులకి వచ్చేడా? లేక జైలుకా. గొంతుకలో తడి ఆరి పోయింది. తను కట్నం అన్నాడని డైరెక్టుగా...? ఛ! ఇంత భయమేమిటి? పరిసరాలు చూసేటప్పటికిగాని ధైర్యం రాలేదు

శేఖర్, రామం ఒక సోఫాలో కూర్చు న్నారు. ఆ ప్రక్కనే పరంధామయ్య గారు కూర్చున్నారు. వాళ్లకి ఎదురుగా పోలీసు డ్రస్సులో ఒక భారీ విగ్రహం పగలు చూస్తే రాత్రి కల్లో కొచ్చేలా ఉన్న మనిషి, కూర్చున్నాడు. తన్ను తాను తమాయించుకుని తన ఊహా సుందరి గురించి కళ్లతోటే వెతుకు తున్నాడు.

"ఈయన రంగారావుగారని పోలీసు ఆఫీసర్. ఈయన కూతురే పెళ్ళి

కూతురు "అని ఆయన్ని శేఖర్ కు, రాముకి పరిచయం చేసేడు పరంధామయ్య. శేఖర్ ముందు కరచాలనంచేసి నకును తానూ పరిచయం చేసుకున్నాడు. రామం ఆయనతో కరచాలనం చేస్తుంటే సంకెళ్లు వేస్తున్నట్లు ఫీలయ్యాడు.

"అమ్మాయిని తీసుకురావోయ్."

కంచుగంటలా ఉంది ఆయన కంఠం.

"లోపలి నుంచి ఒక నలభై ఏళ్ళ ఆవిడ, ఆ పిల్ల తల్లి కాబోలు, ఆ వెన కాలే ఒక ఇరవైనాలుగేళ్ళ అమ్మాయి బయటకు వచ్చారు. వాళ్ళు వచ్చిన రెండు నిముషాలకు ఒక ఇరవై ఏళ్ళ అమ్మాయి పెళ్ళికూతురు కూర్చున్న కుర్చీ వెనక్కాలే నిలబడింది. ఆ నుంచున్న అమ్మాయి అచ్చం తన ఊహాసుందరిలానే వుంది. అమాంతం వెళ్ళి కౌగిలించుకుందామనుకున్నాడు. కాని ప్రక్కనున్న "హంటర్" ని చూసి భయపడ్డాడు. ఆమెకేసే చూస్తున్నాడు రామం

"రంగారావుగారి కనుసైగతో ఆ మెరుపుతీగ లోపలికెళ్ళిపోయింది. రామారావు చూపులు అప్రయత్నంగా పెళ్ళికూతురుమీద నిలిచేయి. తన పెర్సనాలిటీకి ప్రతివచ్చే పెర్సనాల్టీ. కౌగలించుకుంటే కట్టెలా ఉంటుంది. పాలిపోయిన వదనం, కొంచెం నల్లగా వుంది. మూతి ఆంజనేయుడు మూతిలా ఉంది నెరిసినజుట్టుకి బలవంతంగా రంగు వసినట్టు తెలుస్తూనేవుంది. ఎండి తిన్నట్టున్న అధరాలు. రామారావుకి మూర్ఛ వచ్చినంత పనైంది. ఆముదం తాగినట్టు పెట్టేడు ముఖం.

"ఏమిటోయ్ అలా చూస్తున్నావ్ ?"

అన్న పరంధామయ్యగారి పిలుపుతో ఈ లోకంలో కొచ్చేడు అతను ఆయన ప్రశ్నకి ఒళ్ళు మండింది "పీడి కార్థం. ఈ అపురూప సౌందర్యాన్ని చూడకుండా వుండలేక" అందామనుకున్నాడు. కాని పులిని చూసి భయపడ్డాడు. పరంధామయ్యని ఉన్నపళంగా పీక నొక్కి చంపేయాలన్నంత కోపం వచ్చింది.

"మీ పేరేమిటండి ?" ఏమీ మాట్లాడకపోతే బాగుండదని అడిగేడు.

"వ... వ... వ... వసుంధర."

ఐదు నిముషాలు పట్టిందేమో పేరు చెప్పడానికి.

ఆ దెబ్బతో రామంకి త్రేళ్ళు ప్రాకినట్లయింది. ఈ అవతారానికి తోడు నత్తి కూడానా. చచ్చేంరా భగవంతుడా అనుకున్నాడు.

"ఏదేనా చదివించమంటారా బాబూ?"

పెళ్ళికూతురు తల్లి వినయంగా అడిగింది.

"అలాంటిదేమీ వద్దండి." అన్నాడు తను. అయినా ఆవిడ వినకుండా సరోజిని పాఠం తీసి ఆరో తరగతి తెలుగు వాచకం ఇచ్చింది.

"స... స... స... సరోజిని ఇస్త్రీ

ప్రుజాలత ఎన్ని ఎన్ని అబ్బునడ. ఇంకో నాలుగు లైన్లు అలాగే చదివింది.

"వెన్న కాదు, నెయ్యి. మజ్జిగ తెచ్చింది." కసిగా తిట్టుకొన్నాడు. ఒకసారి అతన్నిచూసింది. కాని ఆ చూపు శేఖర్ని చూసినట్టే వుంది మెల్లమూలంగా. చిన్నగా నవ్వింది. నోరు చెవులదాకా పోయింది. రామారావుకి జ్వరం వచ్చినంత పనైంది భగవాన్, ఈ నరకబాధ భరించలేను. విముక్తి ప్రసాదించు తండ్రీ అనుకున్నాడు మనస్సులో. అతని మొర ఆలకించినట్లే ఇందాక లోపలికెళ్ళిన పిల్ల కాఫీ, ట్రేతో బయటికొచ్చేసరికి పన్నీటిజల్లు కురిసినట్లనిపించింది.

తనకి కాఫీ కప్పు అందిస్తూంటే పరీక్షగా చూశాడు. అబ్బ,ఎంతబావుంది. ఆ పిల్లే ఈ పిల్ల అవకూడదూ అనుకున్నాడు. ఆమె వేళ్లు తగిలేటప్పటికి ఒళ్లు అంతా ఏదో తియ్యని బాధగా వుంది. గబుక్కున రెండుచేతులు తీసుకుని చెంపలకి రాసుకుందాం అనుకున్నాడు. కానీ అప్పటికే ఆమె వెళ్ళిపోయింది.

"పరంధామయ్యగారూ, ఈ రోజు చిత్రమైన కేసు వచ్చిందండి" అన్నాడు రంగారావు "ఒక తలమాసిన వెధవకి లక్ష కట్నం ఇచ్చి పిల్లనిచ్చేరు"

రామారావు ఒక్కసారి తన తల నిమురుకున్నాడు. తననికాదుకదా! తను ముచ్చనై క్షవరం చయించుకున్నాడు కూడా.

"ఆ పిల్ల కొంచెం కాలు ఈడుస్తుందండి. అంటే కొంచెం కాలు కుంటి అంత అందంగా ఉండదనుకోండి.' అందంగా ఇలాగే వుంటుందేమో బహుశా. ఖర్మ ఈ పిల్లకి ఇదికూడా ఉందేమిటి అనుకుంటూ ఆ పిల్ల కాళ్లకేసి పరీక్షగా చూసాడు రామం.

"తనకిష్టమై చేసుకుని నానా బాధలు పెడుతున్నాడట. వాళ్ళ అన్న పోలీసు రిపోర్టు ఇచ్చేడు దాంతో మేం కలగజేసుకుని నానా చీవాట్లు పెట్టి, కట్నం తీసుకున్నందుకు ఆరునెలలు వేస్తాం అని బెదిరించేటప్పటికి, బుద్ధిగా ఉంటానని, కాయితం రాసిచ్చేడు. ఇప్పుడు కుర్రకారు ఇలా వున్నారండి," అన్నాడు రంగారావుగారు.

తననే ఇండైరెక్టుగా అన్నట్టు తెలుసుకున్నాడు. అంటె, ఓరి వెధవా, చేసుకున్న తరువాత కుక్కిన పేనులా ఉండాలి అని చెప్పడమా! ఓరి దేముడోయ్, చావగొట్టి బలవంతంగా పెళ్ళిచేసేలా ఉన్నారురో' అనుకున్నాడు. ఇంక అక్కడ కూర్చోవడం ముళ్లమీద కూర్చున్నట్లే ఉంది రామారావుకి.

"లేద్దామేమిటోయ్!" అన్నాడు శేఖర్. ఆ మాటలు తేనెలా వినిపించేయి. అనడమే తడవుగా ఆయన దగ్గర సెలవు తీసుకుని బయటపడ్డారు

వస్తూ "ఎలా వుంది అమ్మాయి ?" అన్నాడు శేఖర్ వచ్చే నవ్వు ఆపుకుంటూ.

వాడికి తెలియదూ, ఇంకా నన్ను ఏడిపించాలని కాకపోతే. తను ఏమీ సమాధానం చెప్పలేదు.

"ఆ పిల్లకి కట్నం ఎందుకిస్తున్నారో తెలుసా ? నత్తికి ఇరవై వేలు, మెల్లకి యింకో యిరవై వేలు, కొంచెం కాలు ఈడుస్తుంది.దానికి ఒక పదివేలు, మనిషి సన్నగా ఎండిపోయినట్టుంది చూసేవుగా అంటే హాస్పిటల్ దర్శనమెక్కువన్న మాట దానికో నలభై, ఇకపోను నీ కట్నం పదివేలు అంటే, నీ విలువ ప ది వే లు అన్నమాట. ఇన్నీ తెలుసుండి నేను చెప్పలేదే అంటావు. నీకు ఎలా వుండాలో నాకేం తెలుసు. అయినా లక్ష కట్నం" వెటకారంగా వుంది అతని ధోరణి. "ఇంతకీ నచ్చిందో లేదో ?"

ఈసారి నిజంగానే వచ్చే కోపం వచ్చింది. "మరీ ఫూల్‌లా మాట్లాడకురా! లక్ష గురించి ఆ పిల్లని చేసుకుని రేపటి నుంచి క...క...క...క...చ...చ... చ... త... త... త... అ ం టూ కూర్చోవాలి. దయచేసి ఇంక ఆ టాపిక్ ఎత్తకురా బాబు" అన్నాడు రెండు చేతులూ జోడించి.

"ఈ సారి శేఖర్‌కి నిజంగానే నవ్వు వచ్చింది. సరేగానీ ఆ వెనకాలే వచ్చిన అమ్మాయి ఎలా వుందిరా ?" అడిగాడు భుజం తడుతూ.

"ఆ పిల్లకేంరా బంగారం ?" ఆ తరువాత ఇద్దరి మధ్య ఇంక మాటలు సాగలేదు. ఎవరి ఇళ్ళకు వారు వెళ్లారు.

ఆ దెబ్బకి నాలుగు లంకణాలు చేసేడు రామం. కలలోకూడా వసూ నన్ను వదులు, నన్ను వదులు అంటూ పలవరింతలే. కాని ఆ మెరుపుతీగను గాఢంగా ప్రేమించాడు

* * *

పై సంఘటన జరిగిన వారంరోజులకి రామకృష్ణా థియేటరులో సినిమా చూసి వస్తుంటే కనిపించింది ఆ రామ చిలుక తను మెల్లగా అనుసరించాడు. పలకరించాలని ఉంది, కాని, ఏమని పలకరిస్తాడు ? ఏమంత పరిచయం ఉందని ? ముందు పాదాలు చూసేడు. అతని అదృష్టంకొద్దీ హైహీల్సు జోళ్ళు లేవు. మొత్తానికి మొండిధైర్యంతో మాట్లాడాలి అనుకున్నాడు.

"ఏమండీ, ఏమండోయ్."

వెనక్కి తిరిగి చూసింది సుగుణ... నల్లటి కళ్లు నక్షత్రాల్లా మెరిసాయి. ఒక్కసారి ఆలోచించి "ఓ, మీరా ! ఏమిటి ఇలా వచ్చేరు ?" అంది నవ్వుతూ. ఆ నవ్వేటప్పుడు చిన్న సొట్టలు పడ్డాయి బుగ్గలు.

కన్నార్పకుండా ఆమెనే చూస్తున్నాడు. ఆమె "ఏమిటి మహానుభావా ఆ



చూపు ?" అనేటప్పటికి "ఏంలేదండి సి...సి...సి... సినిమాకి వచ్చేనండి. అన్నాడు తడబడుతూ. "మిమ్మల్ని చూసినప్పటినుండి నా మనస్సు మనస్సులో లేదండి," అన్నాడు ధైర్యం చేసి.

"అయ్యో పాపం! ఏదేనా రోగమాండి?" అడిగింది వచ్చే నవ్వాపుకుంటూ.

"ఏమిటో నాకే అర్ధం కావటం లేదండి ఏదో బాధ."

"అందులోనూ మనస్సు మనస్సులో లేదంటున్నారు. ఇలాగే ఆలోచించి మా యింటి పక్కాయన 'హరి' అన్నాడు." అంది వచ్చే నవ్వాపుకుంటూ.

"నిజంగానాండీ?" జాలిగా భయంగా ముఖం పెట్టాడు

టాపిక్ మార్చే ఉద్దేశంతో "ఇంతకీ

మా వసు నచ్చినట్టేనాండీ?" అడిగింది సుగుణ.

"లేదండి...మీ వసుని చూసిన తరువాత నాలుగు లంకణాలు చేసేనండి. దానినిబట్టి అర్థం చేసుకోండి "

ఈసారి పైకే నవ్వేసింది సుగుణ.

"మీరు అలా నవ్వుతూంటే చాలా బావుంటారండి.'' అన్నాడు ఇంకొంచెం ధైర్యం చేస్తూ.

"షటప్'' కళ్ళు ఎర్రచేసింది ఆ ఎరుపు పాలమీగడలాంటి చెక్కిళ్ళమీద పడి చిత్రంగా అందం ఇచ్చింది.

"మీరు కోపంలోకూడా బాగుంటారండి.'' అన్నాడు తదేకంగా చూస్తూ.

ఈసారి నవ్వకుండా ఉండలేక పోయింది. "మీరు భలే మాట్లాడుతారే ! మీ అవతారం చూసి బుద్ధావతారం అనుకున్నాను.''

"నిజంగా నేను బుద్ధావతారమేనండి మిమ్మల్ని ఛూసినప్పటినుండి కృష్ణావతారంగా మారేనండి.'' అన్నాడు నవ్వుతూ "ఎంతసేపని రోడ్డుమీద మాట్లాడుతారు? కాఫీ త్రాగుదాం రండి." అన్నాడు ఏమంటుందోనని ఎదురు చూస్తూ.

"ఇప్పుడెందుకండి? నేను వెళ్ళిపోవాలి. ఇంటిదగ్గర అంతా ఖంగారు పడతారు కూడా'' అంది అయిష్టంగా. అతను మరీ బలవంతం పెట్టేసరికి కాదనలేకపోయింది.

సర్వర్‌కి రెండు స్వీట్లు ఆర్డరు ఇచ్చేడు ఏం మాట్లాడుకోవాలో ఏం తోచడంలేదు. ఆఖరికి తనే ధైర్యంచేసి "మీ పేరు తెలుసుకోవచ్చాండీ'' అని అడిగాడు.

"దానికేం మహాభాగ్యం మహానుభావా ! నా పేరు సుగుణ. బి.ఏ. పాసై, ఉద్యోగ వేటలో ఉన్నాను. మొన్న చూసేరా ఆయన మా బాబాయి. ప్రస్తుతం అక్కడే ఉంటున్నా "గడగడ పాఠం ఒప్పజెప్పినట్లు చెప్పి, ఇంక వివరాలు చాలా అన్నట్లు చూసింద.

తనగురించి క్లుప్తంగా చెప్పాడు. ఇంక ఉండబట్టలేక మనసులో కోరిక చెప్పాలనుకున్నాడు. ఇంతలో సర్వర్ వచ్చి స్వీట్లు బల్లమీద పెట్టడంతో ఒకటి ఆమెకి ఆఫర్ చేసి ఒకటి తను తీసుకున్నాడు. తదేకంగా ఆమెనే చూస్తున్నాడు. అదే సమయంలో సుగుణ అతనిని చూడడంతో ఇద్దరి చూపులు కలుసుకుని విడిపోయాయి.

'అందగాడే ! ఒక్క పర్సనాలిటీ తప్ప. మనస్సులోనే తృప్తిపడింది సుగుణ.'

'ఎంతందంగా ఉంది ? నిజంగా తన అర్ధాంగి' అవుతుందా అనుకున్నాడు అతను. ఉన్న ధైర్యం అంతా తెచ్చుకుని, మిమ్మల్ని ప్రేమించాలి అనుకుంటున్నానండి."

ఆ మాటకు ఉలిక్కిపడింది "ఇంకా

ప్రేమించలేదుగా మహానుభావా! రక్షించారు. అయితే ప్రేమించకండి.'' అంది.

"ఛీ కొంచెం చనువుగా వుంటే చాలు ప్రేమ, గీమ" అని లేవబోయింది

తన తెలివితక్కువదనానికి తిట్టుకున్నాడు. ప్రేమించాలనుకుంటున్నానండి, లేక ఏడవాలనుకుంటున్నానండి.. వెధవ మాటలూ, నువ్వూ. మిమ్మల్ని ప్రేమించాను. మీరు లేకపోతే నేను లేను ఈ సర్వర్ సాక్షిగా, ఈ బల్లలు సాక్షిగా, ఇంకా ఇలాగే నవలలో డైలాగులు నాలుగు మాట్లాడలేకపోయానా అనుకున్నాడు మొండిధైర్యంచేసి ఆమె చెయ్యి పట్టుకుని కూర్చోబెట్టాడు

అనుకోని సంఘటనకి తెల్లబోయింది. బయటికి కటువుగా వున్నా, ఆ స్పర్శ నరనరాలకి తాకి ఏదో తియ్యని సుఖం. అలాగే ఆ చేతిని చెంపలకి రాసుకోవాలి అనుకుంది. దాదాపు ఆతని పరిస్థితీ ఇంతే! బహుశా మొదటి అనుభూతి అలాగే వుంటుందేమో!

"నిజంగా మిమ్మల్ని ప్రేమిస్తున్నానండి. మీరు కాదంటే చచ్చిపోతానండి" అన్నాడు దాదాపు ఏడవడానికి సిద్ధంగా.

సుగుణకి ఈసారి నిజంగా జాలేసింది. ఒక్కసారి పరీక్షగా చూసింది రామాన్ని. ఉంగరాల జుట్టు, పసితనం పోని వదనం, ఆరాధనాపూర్వకమైన మనస్సు... అంతకంటే ఏ ఆడదానికి మాత్రం ఏం కావాలి? అనుకుంది. అతనిలో ఏ లోపం కన్పించలేదు.

"మరి మీకు లక్ష కట్నం కావాలన్నారుగా. మాకు అంత స్తోమత లేదు," అంది నిరాశగా.

"అదే సమస్య అయితే నాకు పైస కట్నం వద్దండి. మీరే కోటిరూపాయల విలువ."

ఆమె కళ్ళలో వెలుగు సరే అన్నట్లు కనిపించింది. ఆమె చేతులను తన చేతులలోకి తీసుకున్నాడు. వాళ్ళకి ఈ ప్రపంచంతో సంబంధం లేనట్టు వుంది. సర్వర్ రావడంతో ఈ లోకంలోకి వచ్చారు. సుగుణని దిగబెట్టి ఇంటికి వచ్చేసరికి పదకొండయింది

ఆ రాత్రి తీయని కలంతో మత్తుగా నిద్రపోయాడు.

* * *

రామం, సుగుణల వివాహం నిరాడంబరంగా జరిగిపోయింది. తను కలలు కన్న అందాల బొమ్మ భార్య అయేటప్పటికి రామం ఆనందానికి అవధులు లేవు. నడిస్తే కందిపోతుందేమో అన్నంత అపురూపంగా చూసుకుంటున్నాడు రోజులు సరదాగా, కులాసాగా గడిచిపోతున్నాయి. ఆఫీసు వదిలిన తరువాత ఒక క్షణంకూడా భార్యని వదిలి వుండలేకపోతున్నాడు. దాదాపు సుగుణకూడా అంతే.

ఆ రోజు పౌర్ణమి. పిండారబోసిన

ట్టుంది వెన్నెల. జాజిపందిరి క్రింద మంచంమీద వెల్లకిలా పడుకుని, నిర్మలంగా వున్న ఆకాశంలోకి చూస్తున్నాడు. మేఘాలు దూదిపింజల్లా కదులుతున్నాయి. వాతావరణం ప్రశాంతంగా వుంది వలపుజంటలని దొంగలా చూస్తున్నాడు జాబిల్లి. సుగుణ రావడంతో సుగుణవైపు తిరిగాడు రామం.

తెల్లటి చీర కట్టుకుంది. దానిమీద నల్లటి బోర్డరు అంచు, తెల్లటి జాకెట్టు, జడలో విరబూసిన మల్లెలు, నవ్వుతున్నపుడు తళుకుమని నక్షత్రాల్లా మెరిసే పలువరస, అచ్చు పాలరాతిబొమ్మలా, జాబిల్లికి పోటీపడుతున్నట్లు వుంది.

కన్నార్పకుండా చూస్తున్నాడు సుగుణని. మంచంమీద కూర్చుంటూ, 'ఏమిటీ,అలా చూస్తున్నారు మింగేసేలా' అంది సుగుణ ఉంగరాల జుత్తు సవరిస్తూ.

"నిజంగా మింగేయాలనే వుంది సుగుణా! నిజంగా నువ్వు ఎంత అందంగా ఉంటావు." ఆమెని దగ్గరగా తీసుకున్నాడు.

" తినేస్తానన్నారుగా ! " భయం నటిస్తూ దూరంగా జరిగింది.

"నిజంగా తినేస్తానేమిటి ? ఇలా తినేస్తా !" అంటూ కౌగిలిలోకి తీసుకున్నాడు.

"ఏమండీ, నాదో చిన్న కోర్కె. తీరుస్తారా ?" అంది ఆడదానికి ఏ సమయంలో మగాడిచేత వాగ్దానాలు చేయించుకోవాలో బాగా తెలుసు. అందుకనే ఆ సమయంలో అడిగింది సుగుణ.

"అడక్కుండా ఎలా తీరుస్తానోయ్, అడుగు" అన్నాడు. పల్చటి చేతులు ముద్దుపెట్టుకుంటూ.

"మీరు రేపటినుంచి వ్యాయామ కళాశాలకి వెళ్లరూ ?" గోముగా జుత్తు సవరిస్తూ అంది.

తెల్లబోయాడు రామారావు. ఇపుడు తనకి ఏం లోటు వచ్చింది ? అదే అడిగాడు భార్యని

"ఇపుడు మీకు లోటని కాదు కాని......"

"ఏమిటి చెప్పవోయ్, సందేహమెందుకు?" నడుం చుట్టూరా చేయివేసి, దగ్గరగా తీసుకుంటూ అడిగాడు రామారావు.


అతనిచ్చిన ధైర్యంతో "మీకేకాదు నాకూ కొన్ని కోర్కెలూ, ఆశయాలు ఉంటాయి. అవి తీర్చవలసిన బాధ్యత భర్తగా మీకుంది అవునంటారా ?"

"అవును, కాదని నేను ఎప్పుడైనా అన్నానా ?''

"అంటారని కాదుకాని మీరు చేయగలరా అని!" అనుమానంగా అన్నది.

"కొంపముంచి మీరు నచ్చలేదు. విడాకులివ్వండి అనవుకదా ?" హాస్య ధోరణిలో అన్నాడతడు.

"అదుగో అప్పుడే అనుమానమే.




నేను చెప్పనులెండి'' అంది బుంగమూతి పెట్టి.

"అప్పుడే కోపం. నువ్వు కోపంలోనే ఇంకా బావుంటావోయ్. చిన్నగా ముద్దు పెట్టుకున్నాడు. సరే అడుగు. నువ్వు అడగకముందే ప్రామిస్ చేస్తున్నాను'' అంటూ చేతిలో చేయివేసాడు. తన భర్త గంభీరంగా, మంచి ఆజాను బాహుడులా ఉండాలని ప్రతి ఆడది కోరుకుంటుంది. "ఇలాంటి వెన్నెలలో మీ గుండెమీద తల ఆన్చి కబుర్లు చెప్పాలని వుంటుంది. మీకు అన్నీ బాగున్నాయి కానీ మీ పెర్సనాలిటీ మరీ బాధగా ఉంది. అందుకే మిమ్మల్ని కళాశాలకు వెళ్ళ మంటున్నాను.''

రామారావు విరగబడి నవ్వేడు. ఆ నవ్వుతో సుగుణని ఉక్కిరిబిక్కిరి చేసాడు. "ఇంతేనేమిటోయ్. ఇంకా ఏదో పెద్దకోర్కె అనుకున్నాను. నాకుమటుకు వుండదూ–ఛాతీ విరుచుకు తిరగాలని. సరే నువ్వు చెప్పినట్లు చేస్తాను" అన్నాడు, భార్య అధరాలు అందు కుంటూ. అంతదాకా దొంగలాగ చూస్తున్న జాబిల్లి పట్టుబడ్డట్టు మామిడి చెట్టు ప్రక్కకు తప్పుకొన్నాడు.

* * *

"మహానుభావా! మీ పెర్సనాల్టీ మాట దేవుడెరుగు. మీకు సేవచేసేటప్పటికి మీలా నేను అవుతాను." అంది ఒక రోజు కాళ్ళు పడుతూ.

"ఇప్పుడే అలా అంటే ఎలాగోయ్. కొంచెం ఓపిక పట్టాలి, కోర్కెలు తీరా లంటే'' అన్నాడు, దగ్గరగా తీసుకుంటూ.

ఆ రోజు ఆఫీసుకి వెళ్ళివచ్చి తిన్నగా బట్టలుకూడా వదలకుండా, గదిలోకెళ్ళి పడుకున్నాడు. కాఫీ పట్టుకొచ్చిన సుగుణకి అతనలా పడుకోవడం ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ రావడంతోనే తనను ఉక్కిరిబిక్కిరి చేసే అతడు, అలా పడుకోవడంతో కొంచెం భయంకూడా వేసింది. కాఫీకప్పు బల్లమీద పెట్టి దగ్గరగా వెళ్ళి "ఏమండీ, ఏమండీ! అలా ఉన్నారేం?'' అంది తలమీద చేయివేసి. తల కాలిపోతోంది. ఏమిచెయ్యాలో ఆలోచన తోచలేదు. రెండుసార్లు పలకరించినా అతడు పలకలేదు. దాంతో గబా గబా తలుపు దగ్గరగా వేసి వాళ్ల ఫ్యామిలీ డాక్టర్‌ని తీసుకువచ్చింది. ఆయన చూసి ఏవో మందులు ఇచ్చి వాడే విధానం చెప్పి రేపు వస్తానమ్మా అని వెళ్ళిపోయాడు. సుగుణకు తెల్లవార్లూ నిద్రలేదు. ఆయన చెప్పినట్టే మందులు వేసింది. అయినా ఏదో బెంగా, భయం! ఛ ఆయనను కష్టపెట్టాను. నా మూలంగానే ఆయనకు జ్వరం వచ్చింది. ఆ రాత్రి ఎలా గడిచిందో దేవుడికి తెలుసు. వెయ్యి దేవుళ్ళకు మొక్కింది.

ఉదయమే డాక్టరు చూసి టైఫాయిడ్ అని తేల్చాడు. మందులు రాసి జాగ్రత్తగా వాడమన్నాడు. సుగుణకు ఆ మాట వినేప్పటికి నెత్తిన పిడుగుపడ్డట్టు అయింది. ఇంక అతడితోటిదే ప్రపంచం అయింది. ఇరవైనాలుగు గంటలు అతని వద్దనే ఉండేది. దూరపు చుట్టం బామ్మగారు ఉంటే ఆవిడను రప్పించడంవల్ల ఇంటివిషయాలు ఆమె చూసుకొనేది. అలా ఇరవైనాలుగు రోజులు పట్టింది, అతనికి తగ్గడానికి. క్రమేపీ కోలుకున్నాడు. ముసలావిడ వెళ్ళిపోయింది. ఒకరోజు అన్నంతినిపిస్తూ బావురుమంది. మిమ్మల్ని ఈ స్థితికి నేనే తెచ్చేనని, ఇంక అసలు కళాశాలకు వెళ్లవద్దని ఒట్టు పెట్టించుకొంది. వ్యాయామం వల్ల వచ్చిందని సుగుణ అనుమానం.

ఒకరకంగా టైఫాయిడ్ రావడం మేలే అయింది, రామానికి. అతడు శారీరకంగా చాలా మారిపోయాడు. సుగుణ ఊహించుకొన్న ఊహామూర్తిగా మారటానికి ఎన్నో రోజులు పట్టలేదు ఇప్పటి రామానికి మునపటి రామానికి పోలికే లేదు. అంతగా మారిపోయాడతను.

ఆ రోజుకి సుగుణకు పెళ్ళి అయి సంవత్సరమైంది. ఆ రోజు రోజూకంటె అందంగా అలంకరించుకుంది. బ్లూ కలర్ శారీ. అదే రంగు బ్లౌజు అన్ని అలంకారాలు వాటికి మ్యాచ్ అయ్యేలా చేసుకుంది అతని గురించి ఎదురుచూస్తూ ఉంది. సన్నగా ఈలవేసుకుంటూవచ్చాడు రామం. "ఏమిటో ఈ రోజు బ్లూ స్టార్‌లా తయారయ్యావు. ఏమిటి విశేషం?"

"పెద్ద మీకు తెలియనట్లు. నా చేత చెప్పించాలని కాకపోతే, నాటకం.''

"తెలిస్తే చెప్పనూ. అబ్బా సస్పెన్సు ఎందుకు చెప్పమ్మా" బతిమాలుకున్నాడు.

"అయితే ఉండండి" అంటూ లోపలికి వెళ్ళి ఒక ప్యాకెట్ పట్టుకువచ్చి "మాట్లాడకుండా ఇవి కట్టుకురండి" అంది. లోపలికి వెళ్ళి ఆ బట్టలు కట్టుకు వచ్చాడు.

కళ్ళు అంతంత చేసుకొని చూస్తోంది, భర్తను. తెల్లటి గ్లాస్కో పంచె, దానిమీద గ్లాస్కో లాల్చీ, విశాలంగా కనుపించే వక్షస్థలం కన్నార్పకుండా అలాగే చూస్తున్న భార్యను చూసి "దిష్టి తగులుతుందోయ్ మళ్ళీ మామూలుగా అయిపోతాను" అన్నాడు.

రెండు వేళ్లతో అతని నోటిని మూసి "ఎప్పుడూ అలా అనకండి. మీరిలా ఉంటే ఎలా ఉన్నారో చెప్పనా? అచ్చు......" ఆ తరువాత సిగ్గు పడిపోయింది. "అయితే ఇప్పుడు చెప్పవోయ్," అంటూ తన దగ్గరగా తీసుకున్నాడు.

"మహాశయా, ఈ వేళ ఈ బుద్ధావతారాన్ని పెళ్లిచేసుకొన్న రోజు" అంది నవ్వుతూ.

"సారీ. మర్చిపోయానోయ్, ఏం కావాలో చెప్పు" నుదురు ముద్దుపెట్టుకుంటూ అడిగేడు

"అత[illegible]గుండెమీద తల ఆన్చి మమ్మల్ని ఒక కోరిక కోరాను జ్ఞాపకం ఉందా?" ఏమిటి అన్నట్టు చూసాడు రామారావు.

"ఛా అన్నీ నేనే చెప్పాలి" ఇలాగే మీ ఛాతీమీద పడుకుని కబుర్లు చెప్పుకోవాలని" అంది రెండుచేతులతో కళ్ళు మూసుకొంటూ.

"ఈ రాముం మునపటి రాముం కాదుగదా. అందుకనే నాకు ఒక ఆశ ఉండేదోయ్. తీరిపోయింది అనుకో. అయినా చెబుతున్నాను."

ఏమిటీ అన్నట్లుగా చూసింది సుగుణ.

రెండుచేతులతో ఆమె చెంపలు నిమురుతూ, "ఇలాంటి బుగ్గలు, ఇలాంటి పెదాలు, ఈ ముత్యాలలాంటి పలువరస, ఈ వంపులు, ఈ అందం-అచ్చు నీలాంటి అమ్మాయి భార్యగా కావాలనుకున్నాను తెలుసా" అంటూ తన బలమైన కౌగిలిలోకి తీసుకుని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

